www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 5 జూన్ 2024

8 పేజీలు







తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

కూటమి క్లీన్ స్వీప్

- తూర్పులో సత్తా చాటిన టిడిపి, జెఎస్‌పి
- 21 అసెంబ్లీ, 3 పార్లమెంట్ స్థానాల్లో విజయం
- పత్తా లేకుండా పోయిన ఫ్యాను
- జిల్లాలో ముగ్గురు మంత్రుల పరాజయం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అన్ని స్థానాల్లో హవా చాటింది. వార్ వన్‌సైడ్ అన్నట్టుగా మూడు జిల్లాల్లో మొత్తం 21 స్థానాలను కైవసం చేసుకుంది. వీటిలో టిడిపి అభ్యర్థులు 14 స్థానాల్లో, జనసేన అభ్యర్థులు 6 స్థానాల్లో, బిజెపి అభ్యర్థి ఒక స్థానంలో విజయకేతనం ఎగురు వేశారు. సైకిల్ స్పీడుకు, గాజుగ్లాసు పదునుకు ఫ్యాను పత్తాలేకుండా పోయింది. అధికార వైసిపి పార్టీ ఘోర పరాజయం పొందింది. కాకినాడ, రాజమండ్రి, అమలాపురం పార్లమెంటు స్థానాలను సైతం కూటమి తన ఖతాలో జమేసుకుంది.



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

22 రోజుల నిరీక్షణ అనంతరం కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం కాకినాడ, రాజానగరం, ముమ్మిడివరంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లు తెరుచుకున్నాయి. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించారు. అనంతరం ఇవిఎంలో ఓట్లను లెక్కించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా తొలి ఫలితం రాజమహేంద్రవరం రూరల్ స్థానం నుంచి వచ్చింది. ఇక్కడి టిడిపి అభ్యర్థి గోరంట్ల బుచ్చియ్య చౌదరి హ్యాట్రిక్ సాధించారు. అంతేకాకుండా పదిసార్లు పోటీ చేసిన ఆయన తన ఖాతాలో ఏడో విజయాన్ని నమోదు చేసుకున్నారు.

పోస్టల్ బ్యాలెట్ సహా ఆది నుంచి కూటమి అభ్యర్థులు ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చారు. రౌండ్ రౌండ్‌లోనూ టిడిపి, జనసేన అభ్యర్థులకు స్పష్టమైన మెజారిటీ కనిపించింది. వైసిపి విజయం సాధిస్తుందని భావించిన కాకినాడ సిటీ, తుని, అనపర్తి, రాజోలు, పి.గన్నవరం వంటి స్థానాల్లోనూ ఘోర పరాజయం తప్పలేదు. అనపర్తిలో తొలుత బిజెపి, వైసిపి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సగం రౌండ్లు పూర్తయ్యే సరికి బిజెపి హవా కొనసాగింది. చివరకు అక్కడ బిజెపి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించారు.

మంత్రులకు తప్పని పరాజయం

తుని నుంచి ప్రాతినిథ్యం, వహిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా, అమలాపురం నుంచి బరిలో నిలిచిన రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, గోపాలపురం నుంచి పోటీలో నిలిచిన హోంమంత్రి తానేటి వనిత,

2లో..

పార్లమెంట్ స్థానాల్లో విజేతలు వీరే...



జి.హరీష్ మాధుర్
అమలాపురం



తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్
కాకినాడ



దగ్గుపాటి పురందేశ్వరి
రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పార్లమెంట్ నియోజక వర్గాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	కూటమి	వైసిపి	కాంగ్రెస్	ఆధిక్యం
రాజమండ్రి	16,23,149	12,46,557	7,26,515	4,87,376	32,508	2,39,139
కాకినాడ	16,34,122	11,98,364	7,18,971	4,95,188	20,258	2,23,783
అమలాపురం	15,31,410	11,77,871	7,96,981	4,54,785	15,082	3,42,196

నీట్‌లో తిరుమల ప్రభంజనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్లో రాజమహేంద్రవరంలో తమ తిరుమల ఐఐటి, మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. పి.బేబీఅభిజ్ఞ 720 మార్కులకు 715 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు, పి.శివ సంపత్ నాయుడు 720 మార్కులకు 715 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 46వ ర్యాంకును, ఎన్.రాధాకృష్ణ 720 మార్కులకు 710 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 116వ ర్యాంకు, ఇ.లోహిత్ కుమార్ 122వ ర్యాంకు, ఎన్.అనుదీప్ 217వ ర్యాంకు, ఆర్.లహరి 435వ ర్యాంకు, ఎ.హరితేజ 510వ ర్యాంకు, యస్.హేమంత్ 557వ ర్యాంకు, జి.ఓంకార్ 670వ ర్యాంకు, వి.రామకష్ణా రెడ్డి 991వ ర్యాంకు, యస్.సాకేత్ రాఘవ్ 1004వ ర్యాంకును వివిధ కేటగిరీలలో కైవసం చేసుకున్నారని, జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు 10000 లోపు 89 మంది, 20000 లోపు 162 మంది, 30000 లోపు 212 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. 240 మంది పైన విద్యార్థులు మెడిసిన్ సీట్లు సాధించగలరని ఆయన చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్ జి. స తీ ష్ బా బు , ప్రిన్సిపల్ వి.శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.



బేబిఅభిజ్ఞ
27వ ర్యాంకు




పి.సంపత్‌నాయుడు
46వ ర్యాంకు



ఎన్.రాధాకృష్ణ
116వ ర్యాంకు

కార్టూ'నిజం'



తొలిసారి... అధ్యక్షా...



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఈ ఎన్నికల్లో కొందరు తొలిసారి అసెంబ్లీలోకి అడుగు పెట్టబోతున్నారు. కాకినాడ జిల్లా తుని టిడిపి అభ్యర్థి యనమల దివ్య తాజాగా రాజకీయాల్లోకి వచ్చి తొలిసారి పోటీ చేసి గెలుపొందారు. వరుపుల రాజా అకాల మరణంతో అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన ప్రత్తిపాడు టిడిపి అభ్యర్థి వరుపుల సత్యప్రభ కూడా మొదటిసారి పోటీ చేసి భారీ మెజారిటీతో ప్రత్యర్థిపై విజయం సాధించారు. పవన్‌కళ్యాణ్ గత ఎన్నికల్లో గాజువాక, భీమవరం స్థానాల నుంచి పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. ఈసారి పిఠాపురం నియోజకవర్గం నుంచి బరిలో నిలిచిన ఆయన భారీ మెజారిటీతో తొలిసారి అసెంబ్లీలోకి అడుగు పెట్టబోతున్నారు. అలాగే గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ కూడా మొదటసారి అడుగు పెట్టబోతున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజవర్గానికి చెందిన జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, రాజోలు జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్, రామచంద్రపురం టిడిపి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ కూడా మొదటి సారి అసెంబ్లీలోకి వెళుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సిటీ టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరాం, కొవ్వూరు టిడిపి అభ్యర్థి ముద్దిపాటి వెంకట్రావు, నిడదవోలు జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ కూడా మొదటి సారి అసెంబ్లీలో అధ్యక్షా అనబోతున్నారు.

మొదటి సారి లోక్ సభకు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు ఎంపీ అభ్యర్థులు మొదటిసారి పార్లమెంటులో అడుగు పెట్టబోతున్నారు. కాకినాడ జనసేన అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్, అమలాపురం టిడిపి అభ్యర్థి హరీష్ మాధుర్, రాజమండ్రి బిజెపి అభ్యర్థి పురందేశ్వరి కూడా తొలిసారి లోక్ సభలో అడుగు పెట్టబోతున్నారు.

'కోనసీమ'లో కూటమి విజయం


మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల

ఇది ప్రజా విజయం

ప్రజాశక్తి-ఆలమూరు

రాష్ట్రం లో టిడిపి ఘన విజయం సాధించిందని ఇది ప్రజా విజయంగా టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి పేర్కొన్నారు. మండలంలోని చొప్పెల్ల టిడిపి కార్యాలయం వద్ద ఆయన ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొత్తపేట నియోజకవర్గంలో ఇంతవరకు కనివిని ఎరుగని మెజారిటీ బండారు సత్యానందరావుకు ప్రజలు కట్టబెట్టారని చరిత్రలో రికార్డు నిలిచిపోతుందన్నారు. అలాగే పార్టీ జెండాలు పట్టుకుని యువత మండల పరిధిలో విజయోత్సవ బైక్ ర్యాలీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచుకున్నారు. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

6న ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సినర్జిన్ ఇంకా పలు కంపెనీలు ఈ నెల 6న ఉద్యోగమేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్. నరసింహరావు, ప్రిన్సిపల్ కె.మనోహర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్‌సి, ఎంఎస్‌సి పూర్తిచేసిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ జాబ్ మేళాకు అర్హులని అన్నారు. అర్హులైన విద్యార్థిని విద్యార్థులు అందరూ ఈ జాబ్ మేళాలో పాల్గొని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరాటం ప్రవీణ్, ప్లేస్మెంట్ అధికారులు యాలంగి వర ప్రసాద్, బి.శ్రీనివాస్, కె శ్రావణ్ దిలీప్, డాక్టర్ కె.హేమా విజిత, సిహెచ్.జాన్ పాల్, సంసోన్, స్నేహిత, ప్రసన్న, దివ్య, వెంకటేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కె.మనోహర్ పుట్టినరోజు వేడుకల్లో పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు.

అలరించిన కర్రసాము

ప్రజాశక్తి - యానాం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక మదర్ థెరిస్సా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన బాలల వ్యాస వినోద కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల చేత జన విజ్ఞాన వేదిక పాటలు పాడించారు. అనంతరం బోర్లించిన నీటి కగ్లాసుకు కాగితం, జల్లెడ అతుక్కుని ఉండటం, కాగితం మీద రాతను ఎరుపుగా మార్చడం, పెన్సిల్‌తో బియ్యం గ్లాసును లేపడం వంటి ఇంద్రజాల అంశాలను చేసి ప్రదర్శించారు. దానిలో దాగి ఉన్న సైన్స్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు వివరించారు. జెవివి కార్యదర్శి కె.అరుణ కర్ర సాము చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులను ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, టి.శ్రీనివాస్, ఎం.సతీష్ పాల్గొన్నారు.

టిడిపి కౌన్సిలర్ రాంబాబు మృతి

ప్రజాశక్తి - పిఠాపురం



స్థానిక 23వ వార్డు టిడిపి కౌన్సిలర్ అయితే రాంబాబు(55) అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రాంబాబును కాకినాడలో ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి మాజీ ఎంఎల్ఎ వర్మ, టిడిపి కౌన్సిలర్లు నివాళులర్పించారు.


ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ కైవసం

ప్రజాశక్తి-అమలాపురం

సార్వత్రిక సార్వత్రిక ఎన్నికల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎన్‌డిఎ కూటమి విజయకేతనం ఎగురవేసింది. జిల్లాలో పార్లమెంటు, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లోనూ కూటమి నుంచి పోటీ చేసిన టిడిపి, జనసేన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. అమలాపురం పార్లమెంటు అభ్యర్థిగా టిడిపి తరపున పోటీ చేసిన దివంగత లోక్సభ స్పీకర్ జిఎంసి బాలయోగి తనయుడు గంటి హరీష్ మాధుర్ ఘన విజయం సాధించారు. సమీప అభ్యర్థి వైసిపి తరపున పోటీ చేసిన రాపాక వరప్రసాద్ పై దాదాపు 3 లక్షల పైచిలుకు ఓట్ల మెజారిటీతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు.ఆయన కు ఓట్లు లభించగా వైసీపీ కి ఓట్లు వచ్చాయి. అలాగే అసెంబ్లీ సెగ్మెంట్ సంబంధించి అమలాపురం నుంచి టిడిపి తరపున పోటీ చేసిన అయితాబత్తుల ఆనందరావు 38,628 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. సమీప ప్రత్యర్థి వైఎస్ఆర్సిపి తరపున పోటీ చేసిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పై 104022 ఓట్లుసాధించి విజయం కైవసం చేసుకున్నారు. వైసిపికి 65394 ఓట్లు దక్కాయి.అలాగే ముమ్మిడివరం వైసిపి అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్ పై


ధృవపత్రం అందుకుంటున్న టిడిపి అభ్యర్థి ఆనందరావు

టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన దాట్ల బుచ్చిబాబు 38736 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం1,18,687 టిడిపికి, వైసిపికి 79,951 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా కొత్తపేటలో వైసిపి అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి పై టిడిపి అభ్యర్థి బండారు సత్యానందరావు 56479 ఓట్ల మెజారిటీతో విజయకేతనం ఎగురవేశారు.134286 టిడిపికి, 77807 వైసిపికి ఓట్లు లభించాయి. రామచంద్రపురం లో వైసిపి అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాష్ రావు పై టిడిపి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ 26,291ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. ఆయన కి 97,652, వైసిపికి 71361 ఓట్లు వచ్చాయి. మండపేటలో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన ఎంఎల్‌సి తోట త్రిమూర్తులపై టిడిపి అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వర రావు


ధృవపత్రం అందుకుంటున్న రాజోలు జనసేన అభ్యర్థి వరప్రసాద్

44,435 ఓట్లు మెజారిటీ తో విజయకేతనం ఎగురవేశారు. మొత్తం1,16,309 టిడిపికి ఓట్లు, 71,874 వైసిపికి ఓట్లు దక్కాయి. పి గన్నవరంలో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పై కూటమి నుంచి జనసేన తరపున పోటీ చేసిన గిడ్డి సత్యనారాయణ ఓట్లు 33, 367 మెజారిటీతో ఘన విజయం సాధించారు. జనసేనకి 96108 ఓట్లు, వైసిపికి ఓట్లు 62741 ఓట్లు లభించాయి. అలాగే రాజోలులో వైసిపి తరపున పోటీ చేసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పై జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్ 39011, ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. జనసేన కి 95514 ఓట్లు, వైసిపికి 56,503 ఓట్లు లభించాయి. ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో కూటమి కి బలమైన మెజారిటీ లభించాయి.

కూటమి క్లీన్ స్వీప్

(మొదటి పేజీ తరువాయి)

రాజమండ్రి రూరల్ నుంచి తలపడిన బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఓటమిని చవి చూశారు. అలాగే కాకినాడ రూరల్ నుంచి బరిలో ఉన్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు సైతం జనసేన అభ్యర్థి పంతం నానాజీ చేతిలో ఘోర పరాజయం పొందారు.

మూడు పార్లమెంటు స్థానాలు కైవసం

కాకినాడ పార్లమెంటు స్థానానికి మొదటి సారి పోటీ చేసిన జనసేన అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ విజయం సాధించారు. ఇదే స్థానం నుంచి గత మూడు పర్యాయాలుగా పోటీ చేస్తూ ఓటమి చెందిన చలమలశెట్టి సునీల్ నాలుగో సారి పరాజయం పాలయ్యారు. అమలాపురం కూటమి ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాథూర్, రాజమండ్రి నుంచి బిజెపి అభ్యర్థి పురంధేశ్వరి విజయం సాధించారు.

సత్తా చాటిన జనసేనాని

పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సత్తా చాటారు. 70వేలకు పైగా మెజారిటీతో విజయఢంగా మోగించారు. పిఠాపురం కోటపనై జనసేన జెండాను ఎగురవేశారు. సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి వంగా గీతపై ఆయన విజయం సాధించారు. తొలి రౌండ్ నుంచి పవన్‌కళ్యాణ్ స్పష్టమైన ఆధిక్యతను కనబర్చారు. విలక్షణ తీర్పులకు నిలయమైన ఈ నియోజకవర్గ ప్రజలు వలస నేతలను ఎప్పుడూ ఆదరిస్తూనే వస్తున్నారు. ఇప్పుడూ పవన్‌కళ్యాణ్‌ను అక్కున చేర్చుకుని అసెంబ్లీకి పంపారు. ఆర్‌ఓ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పవన్ సోదరుడు నాగేంద్రబాబు అందుకున్నారు. పవన్ గెలుపుతో పిఠాపురంలో టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ వర్మ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన శ్రేణులు సంబరాలు నిర్వహించారు.

కాకినాడ రూరల్‌లో నానాజీ విజయం

ప్రజాశక్తి - కరప, కాకినాడ రూరల్


ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న పంతం నానాజీ

జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ వైసిపి అభ్యర్థి, మాజీ మంత్రి కురసాల కన్నబాబుపై అఖండ విజయాన్ని అందు కున్నారు. పంతం నానాజీకి 1,34,196 ఓట్లు రాగా కురసాల కన్నబాబుకి 62,374 ఓట్లు వచ్చాయి. దీంతో కన్నబాబుపై 71,822 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. కాకినాడ రూరల్ చరిత్రలో ఎవ్వరికి రాని ఆధిక్యతను సాధించారు. మొత్తం 19 రౌండ్లలో మొదటి నుంచి తన ఆధిక్యతను చాటుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేన పార్టీలోకి చేరిన ఆయన 2019 ఎన్నికల్లో రూరల్ టికెట్ నుంచే పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కూటమి ప్రభావంతో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి అండదండలతో నానాజీ భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. ఒకానొక దశలో ఏ అభ్యర్థి గెలిచిన 10 వేల నుంచి 20 వేల ఆధిక్యతతో గెలుస్తారనే అంచనాలు ఉన్నాయి. కానీ ఆ అంచనాలకు మించి పంతం నానాజీ విజయం సాధించారు. దీంతో ఇటు పంతం నానాజీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, అటు పిల్లి సత్యనారాయణమూర్తికి చెందిన నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున సంబరాలు చేసుకున్నారు.

తునిలో పాగా వేసిన యనమల దివ్య

ప్రజాశక్తి - కోటనందూరు


దృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న యనమల దివ్య

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య మంత్రి దాడిశెట్టి రాజాపై 15,861ఓట్లు ఆధిక్యతతో విజ యం సాధించారు. గత మూడు పర్యాయాలుగా తుని నియోజక వర్గం యనమలకు అందని ద్రాక్షాగానే ఉంది. టిడిపి ఆవిర్భావం నుంచి టిడిపికి కంచుకోటగా ఉన్న తుని నియోజకవర్గంలో యనమల రామకృష్ణుడుదే ఆధిపత్యం. అయితే ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రాజా అశోక్‌బాబుపై ఆయన ఓటమి చెందారు. అనంతరం జరిగిన రెండు పర్యాయాలు ఆయన సోదరుడు యనమల కృష్ణుడిని పోటీలో నిలిపారు. అయినా ఫలితం లేకుండా పోయింది. వరుసగా ఓటమిని మూటగట్టుకుంటున్న యనమల రామకృష్ణుడు ఈ దఫా ఎన్నికల్లో తన సోదరుడిని పక్కన పెట్టి తన పెద్ద కుమార్తె యనమల దివ్యను పోటీలోకి దించారు. గతంలో ఎన్నడూ ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించని యనమల ఈ దఫా మాత్రం ప్రచారంలోనూ, ఇతరులను కలుపుకుని వెళ్లడంలోనూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. టిడిపికి చెందిన పలువురిని వైసిపి అభ్యర్థి, మంత్రి దాడిశెట్టి రాజా వైసిపిలోకి తీసుకెళ్లినా ఆయన మాత్రం పట్టు వదలని విక్రమార్కుడిలా తన అనుభవాన్ని, తన రాజకీయ చతురతను ప్రదర్శించారు. తన కుమార్తె యనమల దివ్యను గెలిపించుకోవడం ద్వారా మరోసారి తుని నియోజక వర్గంపై టిడిపి జెండాను ఎగురవేశారు.

పుదుచ్చేరి ఎంపీ స్థానం కాంగ్రెస్ కైవసం...

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజవర్గ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి, సిటింగ్ ఎంపీ వి.వైథిలింగం విజయం సాధించారు. ఆయనకు 3, 67, 633 ఓట్లు రాగా ఆయన సమీప ప్రత్యర్థి బిజెపి, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి అభ్యర్థి నమశ్శివాయంకు 2, 56, 510 ఓట్లు వచ్చాయి. దీంతో వైథిలింగం 1, 11, 123 ఓట్ల ఆధిక్యతతో ఘన విజయం సాధించారు. ఈ స్థానానికి 26 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పుదుచ్చేరి పార్లమెంట్



స్థానం పరిధిలో ఉన్న యానాం నియోజకవర్గంలో ఓట్లను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా మొదటి నుంచి కూటమి బలపరుస్తున్న బిజెపి అభ్యర్థి నమశ్శివాయంకు 22,176 ఓట్లు లభించగా, ప్రస్తుత సిటింగ్ ఎంపి, వి వైథిలింగంకు 7019 ఓట్లు లభించాయి. ఆవిధంగా 15,157 ఓట్లు మెజారిటీ నమశ్శివాయంకు లభించింది. అయితే 30 అసెంబ్లీ నియోజకవర్గాలతో కూడిన పుదుచ్చేరి సభ స్థానం పరిధిలో పుదుచ్చేరిలో ఉన్న సుమారు 23 నియోజకవర్గాలతోపాటు మాహేలో సైతం వైథిలింగం పూర్తి ఆధిక్యాన్ని ప్రదర్శించారు. యానాంకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి అరదాడి పోషియ్యకు 1,077 ఓట్లు లభించాయి. పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో మొత్తం 10,28,689 మంది ఓటర్లు ఉండగా 8,07,724 ఓట్లు పోలయ్యాయి.

'కోనసీమ'లో కూటమి సంబరాలు



అంబాజీపేటలో కేక్ కట్ చేస్తున్న కూటమి శ్రేణులు

ప్రజాశక్తి-యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల్లో మంగళవారం జరిగిన కౌంటింగ్ ప్రకియలో ఫలితాలు వెల్లడయ్యాయి. డాక్టర్‌బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం పార్లమెంట్, ఆ పార్లమెంట్ పరిధిలో కూటమి(టిడిపి, జనసేన,బిజెపి)ల అభ్యర్థులు ఘన విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబంరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చారు. స్వీట్లు పంచారు.

మామిడికుదురు: రాష్ట్రంలో టిడిపి ఉమ్మడి కూటమి భారీ విజయం సాధించడంతో పి.గన్నవరం నియోజకవర్గం లో పలు గ్రామాల్లో మంగళవారం సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు స్వగృహం వద్ద కేక్ కట్ చేసికూటమి శ్రాణులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పి.గన్నవరం నియోజకవర్గ జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ విజయం సాధించడంతో పాశర్లపూడి లంక, పెదపట్నంలంక, లంకలకన్నవరం, పెదపట్నం,



శివల గ్రామంలో టిడిపి శ్రేణుల సంబరాలు

ఈదరాడ, అప్పనపల్లి ప్రాంతాలలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమాల్లో డొక్కా నాథ్‌బాబు, కంకిపాటి నరసింహారావు, విల్ల సుబ్బారావు, ఆదిమూలం సురేష్, మొల్లేటి శ్రీనివాస్ సుందర నీడి రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** టిడిపి ఘన విజయంతో కె.గంగవరం మండలం శివల గ్రామంలో నిడదవోలు సుబ్రహ్మణ్యం, బలుసు శివ ప్రసాద్ ఆధ్వర్యం లో సంబరాలు నిర్వహిం చారు. బ్యాండ్ మేళాలతో, జెండాలు పట్టుకుని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.బాణసంచా కాల్చి స్వీట్స్ పంచుకున్నారు. యర్రపోత వరం వంతెన వద్ద ఫ్యాన్ ఈడ్చుకుంటూ, ఆనందాలతో కేరింతలు కొట్టారు. పలు కమ్యూనిటీ హాలు వద్ద టిడిపి గీతాలు, ఎన్‌టిఆర్ పాటలు వేసి నినాదాలు చేశారు. **ఆత్రేయపురం:** సార్వత్రిక ఎన్నికలలో కూటమి బలపరిచిన కొత్తపేట టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీచేసిన బండారు సత్యానందరావు అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో మండలంలోని17 గ్రామాలలో విజయోత్సవ సంబరాలు జరుపుకుని స్వీట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం చోటు చేసుకుంది. 144 సెక్షన్ 30 అమలులో ఉన్నప్పటికీ టిడిపి , జనసేన, బిజెపి నాయకులు గ్రామాల కూడళ్లలో కేబుల్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. **కపిలేశ్వరపురం:** మండపేట నియోజకవర్గ ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం పట్ల కపిలేశ్వరపురం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో బాణసంచా కాల్చి ఆనందోత్సవాలతో కేకు కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. అలాగే కోరుమిల్లి తదితర గ్రామాల్లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఎంఎల్‌ఎగా వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్రంతో పాటు నియోజకవర్గం అభివృద్ధి చేస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో అభి మానులు, తదితరులు ,పాల్గొన్నారు.

అంబాజీపేట: పి.గన్నవరం నియోజకవర్గ ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం పట్ల అంబాజీపేట లో గణపతి బాబులు మిల్లు వద్ద మండల టిడిపి శ్రేణులు ఆధ్వర్యంలో, పుల్లేటికుర్రు లో జిల్లా అధికార ప్రతినిధి డివివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం టిడిపి నాయకులు,జనసేన, బిజెపి కార్యకర్తలు, అభిమానులు, విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి ఆనందోత్సవాలతో కేకు కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. అలాగే అయినవెల్లి మండల పరిధిలో పలు గ్రామాల్లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంతో పాటు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో అభిమానులు, పాల్గొన్నారు.

ఈ విజయం ప్రజలకు అంకితం:గిడ్డి

టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు కష్టించి పని చేయడంతో లభించిన ఈ విజయం ప్రజలకే అంకితమని పి.గన్నవరం అసెంబ్లీ విజేత గిడ్డి సత్యనారాయణ అన్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్, టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ఆశీస్సులతో ఈ విజయం సాధించానన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానన్నారు. తనను గెలిపించిన పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

అమలాపురం ఎంపీగా గంటి హరీష్

ప్రజాశక్తి-అమలాపురం

సార్వత్రిక ఎన్నికలు 2024లో అమలాపురం ఎంపీ స్థానానికి కూటమి బలపరిచిని టిడిపి ఎంపీ అభ్యర్థిగా గంటి హరీష్ మాదుర్ వైసిపి అభ్యర్థి రాపాక వరప్రసాదరావుపై సుమారు (342196)ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. హరీష్ ఎంపీగా 2019 పార్లమంట్ ఎన్ని కల్లో ఎంపీగా పోటీచేసి వైసిపి ఎంపీ చింతా అను రాధపై ఓటమి పాలయ్యారు. అనంతరం 2024 ఎన్నికలో హరీష్ మాథూర్ విజయం సాధించారు. ఆయన దివంగత మాజీ లోక్‌సభ స్పీకర జిఎంసి బాలయోగి కుమారుడు.

జనసేన'కి రాజోలు 'వరప్రసాదం'

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం మరోసారి జనసేన పార్టీ సొంతమై.. సుస్థిరంగా వర ప్రసాద మయ్యింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళ వారం జరిగిన కౌంటింగ్‌లో జనసేన అభ్యర్థి దేవ వరప్రసాదరావు విజయం సాధించారు. తన సమీప వైసిపి అభ్యర్థి గొల్లపల్లి సూర్యరావుపై (39,011) ఓట్ల మెజారిటితో గెలిపొందారు. దేవ వరప్రసాదరావు అంద రినీ కలుపుకొని ప్రజల్లోకి వెళ్లారు. నియోజక వర్గంలో సమస్యలనుఎలా పరిష్కారం చేస్తారో వివరించారు.

రామచంద్రపురం విజేత 'సుభాష్'

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గానికి పోటీపడిన కూటమి బలపరిచిన టిడిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ తొలి ప్రయత్నంలోనే ఘనవిజయం సాధించి రికార్డు సష్టించారు. అమలాపురం నుంచి రామచంద్రపురం నియోజకవర్గం వచ్చిన సుభాష్‌ను స్థానికేతరడంటూ పలు వివాదాలను సృష్టించినప్పటికీ వాటన్నిటినీ పఠాపంచలు చేస్తూ కూటమి సునామీలో ఆయన సునాయాసంగా విజయం సాధించారు. వైసిసిఅభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌పై (26,291) ఓట్ల మెజారిటీ వాసంశెట్టి సుభాష్ విజయం సాధించారు.

మండపేటలో 'వేగుళ్ల' గెలుపు

మండపేట : మండపేట శాసన సభ్యునిగా 2024 ఎన్నికల్లో వేగుళ్ల జోగేశ్వరరావు విజయ దుందుభి మోగించారు. వైసిపి అభ్యర్థి తోట త్రిమూర్తులుపై (44,435) ఓట్ల మెజార్టీతో వేగుళ్ల జోగేశ్వరరావు గెలుపొందారు. మండపేట నుంచి పోటీ చేసిన వేగుళ్ళ జోగేశ్వరరావు వరుసగా ఆ పార్టీ నుంచి నాలుగుసార్లు ఎంఎల్‌ఎగా విజయం నమోదు చేశారు. 2009, 2014లో టిడిపి గెలుపొందిన జోగేశ్వరరావు 2019లో టిడిపి ఓటమిపాలైనప్పటికీ ఆయన మాత్రం సునాయాస విజయం నమోదు చేశారు

కొత్తపేటలో 'సత్యానందరావు' విక్టరీ

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట శాసన సభ్యునిగా 2024 ఎన్నికల్లో బండారు సత్యానందరావు విజయ దుందుభి మోగించారు. 1994, 1999, 2009, 2024 ఎన్నికల్లో బండారు సత్యానందరావు ఎంఎల్‌ఎగా గెలుపొందారు. 1989, 2004, 2014, 2019 ఆయన ఓటమి పాలయ్యారు. నియోజవర్గ చరిత్రలో నాలుగు సార్లు ఎంఎల్‌గా పనిచేసిన ఎంవిఎస్.సుబ్బరాజు తర్వాత బండారు నాలుగో సారి శాసనసభ్యునిగా గెలుపొ ందారు. 2024 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిపై (56,479) ఓట్ల మెజారిటీ తో ఆయన ఎంఎల్‌ఎగా గెలుపొందారు.

ముమ్మిడివరంలో 'దాట్ల' విజయదుందుభి

ముమ్మిడివరం/కాట్రేనికోన : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి(టిడిపి) అభ్యర్థి దాట్ల సుబ్బరాజు సమీప వైసిపి అభ్యర్థి పొన్నాడ సతీష్ కుమార్ పై (38,736) ఓట్ల మెజార్టీ తో విజయ దుందుభి మోగిం చారు. 2014లో రాష్ట్ర విభజన అనంతరం జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో దాట్ల సుబ్బరాజు విజయం సాధిం చారు. తరువాత 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన ఓటమి పాలైయ్యారు. 2024 ఎన్నికల్లో ముమ్మిడి వరం నుంచి సుబ్బరాజు రెండో సారి గెలుపొందారు.

పి.గన్నవరంలో గెలిచిన 'గిడ్డి'

మామిడికుదురు : పి.గన్నవరం నియోజకవర్గం కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఎంఎల్‌ఎగా విజయం సాధించారు. రాష్ట్ర చరిత్రలోనే పి.గన్నవరం వినూత్న మార్కు కలిగి ఉంది. ఈ టిక్కెట్ తొలుత టిడిపి అభ్యర్థి సరిపల్ల రాజేష్‌కు ఖరారు చేయగా సొంత పార్టీ శ్రేణులు, కూటమి శ్రాణుల నుంచి వ్యతిరేకతరావడం తో ఆఖరి నిమిషంలో పొత్తులో భాగముగా జనసేనకు కేటాయించారు వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి విప్పర్తి వేణు గోపాల్ పై(33,367) ఓట్ల మెజార్టీతో కూటమి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ ఎంఎల్‌ఎగా గెలుపొందారు.

అమలాపురం 'ఆనందరావు' కైవసం

అమలాపురం : అమలాపురం అయితాబత్తుల ఆనందరావు కైవసం అయ్యింది. నూతన జిల్లాలు ఏర్పడిన మొట్ట మొదటిసారిగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో-2024 జిల్లా కేంద్రం అమలాపురం అసెంబ్లీ నుంచి టిడిపి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ఘనవిజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి ఆనందరావు ఆధిక్యతను చాటుకుంటూ వచ్చారు. వైసిపి నుంచి పోటీ చేసిన రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ పై (38,628) ఓట్ల మెజార్టీతో ఆనందరావు సాధించారు. మొత్తం 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా మిగిలిన వారికి డిపాజిట్ దక్కలేదు.

కుమ్మేసిన కూటమి

- ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానం కైవసం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో కూటమి కుమ్మేసింది. ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. పార్లమెంటు స్థానంలో సైతం జనసేన అభ్యర్థి తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్ భారీ మెజారిటీతో గెలుపొందారు. పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్, కాకినాడ సిటీ టిడిపి అభ్యర్థి వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, తుని టిడిపి అభ్యర్థి యనమల దివ్య, ప్రత్తిపాడు టిడిపి అభ్యర్థి వరుపుల సత్యప్రభ, జగ్గంపేట టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం టిడిపి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప గెలుపొందారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభించారు. 8:30 గంటల తర్వాత నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కౌంటింగ్ కొనసాగిస్తూనే ఇవిఎంలలో ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. మొదటి రౌండ్ నుంచి కూటమి అభ్యర్థులు ఆధిక్యతను ప్రదర్శి స్తూనే వచ్చారు. చివర వరకు భారీ ఆధిక్యతను చాటుకున్నారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పంతం నానాజీ భారీ మెజారిటీతో దూసుకెళ్లారు. పెద్దాపురం అభ్యర్థి రాజప్ప మూడోసారి గెలుపొందారు. వనమాడి కొండబాబు కూడా కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి ఇప్పటికే రెండుసార్లు గెలుపొందగా మూడోసారి విజయం సాధించారు. తొలిసారి బరిలో నిలుచున్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య చేతిలో మంత్రి దాడిశెట్టి రాజా ఓటమి చెందారు.



ఇవిఎంలను ఓపెన్ చేస్తున్న ఎన్నికల సిబ్బంది

పవన్‌ను మించిన పంతం ఆధిక్యత

కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన పంతం నానాజీ ఆధిక్యత పవన్‌ను దాటేసింది. పవన్ కళ్యాణ్ 1,32,725 ఓట్లను దక్కించుకోగా 70,354 మెజారిటీ సాధించారు. నానాజీకి 1,34,414 ఓట్లు పడగా 72,040ను సాధించారు.



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న సత్యప్రభ

ప్రత్తిపాడులో సత్యప్రభ గెలుపు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజకవర్గ చరిత్రలో మునిపెన్నడూ లేని ఆధిక్యతతో టిడిపి అభ్యర్థి వరుపుల సత్యప్రభ గెలుపొందారు. ఆమె సమీప వైసిపి అభ్యర్థి వరుపుల సుబ్బారావుపై 38,768 వేల ఆధిక్యతతో విజయం సాధించారు. లెక్కింపు ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి ఆమె ఆధిక్యతను చాటుకున్నారు. డిసిసిబి ఛైర్మన్‌గా ప్రజలకు సేవలందించిన కీర్తిశేషులు వరుపుల రాజాపై ఉన్న అభిమానంతోపాటు, ఆయన సతీమణి వరుపుల సత్యప్రభ క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఏలేరు, సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్ రిజర్వాయర్ ఆధునీకరణ వంటి వాటిపై ఇచ్చిన హామీలు ప్రజలను ఆకట్టుకున్నాయి. వైసిపి పాలనలో ప్రజా సమస్యలపై ఆమె చేసిన పోరాటం ఆమె విజయానికి కారణాలుగా నిలిచాయి.



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న వనమాడి కొండబాబు

కాకినాడలో సత్తా చాటిన వనమాడి

ప్రజాశక్తి - కాకినాడ

టిడిపి కాకినాడ అభ్యర్థి వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) భారీ ఆధిక్యతతో సత్తాచాటుకున్నారు. వైసిపి అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై 56,572 ఓట్ల ఆధిక్యతతో విజయాన్ని సాధించారు. ఇప్పటివరకు కాకినాడ సిటీ చరిత్రలో ఎవ్వరికి రాని ఆధిక్యతను కొండబాబు ఈ ఎన్నికల్లో సొంతం చేసుకున్నారు. మొత్తం 17 రౌండ్లలో వనమాడి కొండబాబు మొదటి నుంచి తన ఆధిక్యతను చాటుకున్నారు. వనమాడి వెంకటేశ్వరరావు టిడిపి ద్వారానే రాజకీయ ప్రస్థానం జరిగింది. 1999లో జరిగిన ఎన్నికల్లో కాకినాడ నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పల్లంరాజుపై 4,506 ఓట్ల ఆధిక్యతతో గెలిచి తొలిసారిగా ఎంఎల్ఎ అయ్యారు. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్తా గోపాలకృష్ణ చేతిలో 33,446 ఓట్ల తేడాతో, 2009లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి 18,641 ఓట్ల తేడాతో ఓటమిని మూటగట్టుకున్నారు. అయితే 2014లో జరిగిన ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై వనమాడి 24,259 ఓట్ల ఆధిక్యతతో రెండోసారి ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. అయితే 2019లో వైసిపి అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి చేతిలో 14,111 ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశారు. ప్రస్తుత ఎన్నికల్లో అదే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై 56,572 ఓట్ల ఆధిక్యతతో ఘన విజయాన్ని సాధించారు. వనమాడి విజయం వెనుక టిడిపి శ్రేణులతోపాటు, జనసేన శ్రేణులు ఐక్యంగా పనిచేయడంతోపాటు, ప్రత్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై ఉన్న అవినీతి, అక్రమాలు, ఇతర ఆరోపణలు కూడా వనమాడి భారీ ఆధిక్యతకు కారణాలుగా నిలిచాయి. వనమాడి విజయంతో టిడిపి, జనసేన శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

నోటాకు తగ్గిన ఓట్లు

ప్రజాశక్తి - పిఠాపురం

గత ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గంలో నోటాకి పోలైన ఓట్లతో పోలిస్తే ఈ ఎన్నికల్లో తగ్గాయి. ఈ ఎన్నికల్లో 4.92 శాతం పోలింగ్ పెరిగింది. గత ఎన్నికల్లో 2334 ఓట్లు నోటాకు పోలు అవ్వగా ఈ ఎన్నికల్లో 2019 ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్ జరిగిన 18 రౌండ్లలో మొదటి రౌండ్ నుంచి చివరి 17 రౌండ్ వరకు నోటాకు ప్రతి రౌండులో 50 ఓట్లకు మించి పోలయ్యాయి. చివరి రౌండ్‌లో 32 నోటా ఓట్లు వచ్చాయి. 11మంది అభ్యర్థులకు పోలైన ఓట్ల కంటే నోటాకు అధిక ఓట్లు పోల్ అవ్వడం గమనార్హం.

చినరాజప్ప హ్యాట్రిక్

ప్రజాశక్తి - సామర్లకోట

టిడిపి పెద్దాపురం నియోజకవర్గ ఎంఎల్ఎగా నిమ్మకాయల చినరాజప్ప చరిత్రను సృష్టించారు. వరుసగా మూడోసారిగా హ్యాట్రిక్ విజయం సాధించిన చినరాజప్ప నూతన చరిత్రకు నాంది పలికారు. వైసిపి అభ్యర్థి దవులూరి దొర బాబుపై 40,815 ఓట్ల ఆధిక్యంతో విజయాన్ని అందుకున్నారు. మంగళవారం ఉదయం కాకినాడ జెఎన్‌టియులో జరిగిన ఓట్ల లెక్కింపులో ప్రతీ రౌండ్‌లోనూ చిన్న రాజప్ప తన ఆధిక్యతను చాటుకున్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఎన్నిసార్లు పోటీ చేసిన ఒక అభ్యర్థి రెండుసార్లు మాత్రమే విజయం సాధించారు. వరుసగా పోటీ చేసిన మూడోసారి ముచ్చటగా విజయం సాధించి నిమ్మకాయల చిన రాజప్ప నియోజకవర్గంలో నూతన చరిత్రను సృష్టించారు. 1962, 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున పంతం పద్మనాభం రెండుసార్లు గెలుపొందగా, 1967, 1978లో సిపిఐ, కాంగ్రెస్ పార్టీల తరపున ఉండవల్లి నారాయణమూర్తి విజయం సాధించారు. అలాగే 1983, 85 ఎన్నికల్లో టిడిపి తరపున బలుసు రామా రావు విజయం సాధించారు. అలాగే 1994, 1999 వర్షం ఎన్నికల్లో దివంగత బొడ్డు భాస్కర్ రామారావు టిడిపి నుంచి రెండుసార్లు విజయ భేరి మోగించారు. అనూహ్యంగా 2014లో పెద్దాపురం నుంచి పోటీ చేసిన రాజప్ప విజయం సాధించారు. హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టి వందల కోట్లతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. 2019లో రాష్ట్రమంతా ఫ్యాన్ గాలి వీచినా నిలదొక్కుకుని ఇదే నియోజక వర్గ ప్రజల మన్ననలను అందుకుని రెండో దఫా విజయం సాధించారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి భారీ ఆధిక్యంతో పెద్దాపురంలో టిడిపి జెండాను ఎగురవేశారు. దీంతో నియోజక వర్గంలో టిడిపి, కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.



ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న చినరాజప్ప

మూడు ఎన్నికల్లో ఆధిక్యత ఇలా..

2014లో పోటీ చేసి ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి తోట సుబ్బారావు నాయుడుపై 10,663 ఓట్ల ఆధిక్యంతో రాజప్ప విజయం సాధించారు. 2019లో వైసిపి అభ్యర్థి తోట వాణిపై 4,027 ఓట్ల ఆధిక్యం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబుపై భారీ ఆధిక్యతతో విజయం సాధించారు.

నాలుగో 'సారీ' చలమలశెట్టి ఓటమి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కాకినాడ పార్లమెంటు స్థానం నుంచి బరిలో నిలిచిన వైసిపి ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ మరోసారి ఓటమిని చవిచూశారు. గత ఎన్నికల్లో మూడు పార్టీల నుంచి పోటీ చేసిన ఆయన మూడు సార్లు ఓడిపోయారు. తాజాగా వైసిపి నుంచి బరిలో నిలిచిన ఆయన జనసేన అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ చేతిలోనూ పరాజయం తప్పలేదు. సునీల్‌కు అన్ని రౌండ్లు పూర్తి అయ్యేసరికి 3,84,110 ఓట్లు రాగా, జనసేన అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ 5,58,980 ఓట్లు సాధించారు. ఈయన ప్రత్యర్థిపై 1,74,870 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. జర్మనీలో పారిశ్రామికవేత్తగా ఉన్న సునీల్ 2009లో రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పటి ఎన్నికల్లో తొలిసారిగా ప్రజారాజ్యం తరపున పోటీ చేశారు. ఆ తర్వాత 2020 ఆగస్టులో జగన్ గూటికి చేరారు. 2014 ఎన్నికల్లో రెండోసారికాకినాడ ఎంపీగా రంగంలో దిగారు. వరుసగా రెండు ఎన్నికల్లోనూ సునీల్ కు ఓటమి తప్పలేదు. అతి స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో వైసిపిని వీడిన ఆయన టిడిపిలో చేరి తిరిగి ఇదే నియోజకవర్గం నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. అయినా ఆయనకు హ్యాట్రిక్ ఓటమి తప్పలేదు. వరుసగా ఎన్నికల ఫలితాలతో చేతులు కాల్చుకున్న సునీల్ ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. త్వరలోనే ఆయన తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోనున్నారని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు.

జ్యోతులకు జైకొట్టిన జగ్గంపేట ఓటర్లు

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి, గోకవరం

జగ్గంపేట నియోజకవర్గ ఓటర్లు జ్యోతుల నెహ్రూకు జై కొట్టారు. నుంచి కూటమి ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూ ఎన్నిక అయ్యారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కల్గిన జ్యోతుల నెహ్రూ ఈ ఎన్నికల్లో విజయానికి ఎంత గానో కృషి చేశారు. వైసిపి అభ్యర్థి తోట నరసింహంపై 52656 ఓట్ల ఆధిక్యంతో విజయాన్ని సాధించారు. 1984, 1994, 2014 సంవత్సరాల్లో ఎంఎల్ఎగా ఎన్నికయ్యారు. ఆయన కుమారుడు జ్యోతుల నవీన్‌కుమార్ నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలను పొం దారు. మెట్ట ప్రాంతానికి సాగు, తాగునీటి కోసం ఎత్తిపోతల పథకంను రాబట్టి ఇక్కడి ప్రజల హృదయాలను గెలుసుకున్నారు. ఈ దఫా ఎన్నికల్లో తన వద్ద ఉన్న లక్ష్యాలను సాధించి నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడతానని, అనంతరం రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. నెహ్రూ విజయంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.



ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న జ్యోతుల నెహ్రూ

నెహ్రూ గెలుపు కార్యకర్తల విజయం

టిడిపి జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విజయం ప్రతి కార్యకర్తకు గెలుపని గోకవరం క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కన్నబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో అక్రమ కేసులను భరిస్తూ నెహ్రూ ఆజెండాను ముందుకు తీసుకెళ్లి ధీటుగా నిలబడిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకిత మన్నారు. నెహ్రూకు గోకవరం మండల ప్రజల పక్షాన శుభాకాంక్షలు తెలిపారు.

'రాష్ట్రంలో దుర్మార్గపు పాలనకు చరమగీతం'

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్రంలో వైసిపి దుర్మార్గపు పాలనకు ప్రజలు చరమగీతం పాడారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ అన్నారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ విజయం తోపాటు, రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థులు విజయంపై స్థానిక రాజుగారి కోటలోని టిడిపి కార్యాలయం నుంచి డప్పుల దరువులతో కోటగుమ్మం సెంటర్‌కు చేరుకుని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చి, ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వైసిపి నాయకులు పవన్‌ను అసెంబ్లీ గేటు ముట్టుకోనివ్వమని అన్నారని, ఈరోజు పవన్‌కు అత్యధిక ఆధిక్యతతో ప్రజలే అసెంబ్లీకి పంపారని అన్నారు. ప్రశ్నించే పవన్ రాష్ట్ర అసెంబ్లీలో ప్రజల గొంతుకగా నిలుస్తారని అన్నారు. చంద్రబాబు, పవన్ నాయకత్వంలో వైసిపిని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేసారన్నారు.

కూటమి విజయంతో గ్రామాల్లో సంబరాలు

ప్రజాశక్తి - కాజులూరు

టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో గ్రామాల్లో సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం కూటమి అభ్యర్థులు ఆధిక్యత సాధించడంతో మధ్యాహ్నం సమయానికి స్థానిక నాయకులు కార్యకర్తలు, అభిమానులు వీధుల్లోకి వచ్చి హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన కాజులూరు, గొల్లపాలెం, కోలంక, కుయ్యేరు తదితర గ్రామాల్లో జనసేన, టిడిపి శ్రేణులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించి స్వీట్స్ పంచారు. ఒకరికి ఒకరు ఆలింగనాలు చేసుకుంటూ విజయోత్సవాలను నిర్వహించు కున్నారు. ఎస్సై తులసీరామ్ ఆధ్వర్యంలో పోలీసులు మండల వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

హ్యాట్రిక్ సాధించిన బుచ్చయ్య చౌదరి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

టిడిపి సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి హ్యాట్రిక్ విజయం సాధించారు. జనసేన కలయిక టిడిపికి కలిసొచ్చిన అంశంగా పేర్కొనవచ్చు. గోరంట్లపై వ్యతిరేకత, అభివృద్ధికి దూరం అపవాదులున్నప్పటికీ బుచ్చయ్య తన రాజకీయ చతురతతో సఫలీకతమయ్యారు. కాపులు, బిసిలు, కమ్మ కులాలవారు అధికశాతం టిడిపికి అనుకూలంగా నిలబడ్డారు. చంద్రబాబుపై విశ్వాసం, కూటమిపై గెలుపు ధీమా పవన్ చరిష్మా ప్రత్యర్థి స్థానికేతరుడు కావడం కలిసొచ్చిన అంశాలుగా ఉన్నాయి. బుచ్చయ్యచౌదరి టిడిపి ఆవిర్భావం నుంచీ పార్టీలో ఉన్నారు. ఎన్‌టిఆర్ క్యాబినెట్‌లో కొన్నాళ్లు మంత్రిగా కూడా పనిచేశారు. 1983లో తొలిసారి టిడిపి తరపున రాజమండ్రిలో గెలిచారు. 1985లో రెండోసారి గెలిచారు. 1989లో తొలిసారి ఓటమి పాలయ్యారు. 1994, 1999లలో రెండు సార్లు గెలిచి సత్తా చాటారు. ఇక 2004, 2009లో ఓటమి చెందారు. 2014, 2019లో రాజమండ్రి రూరల్ నుంచి గెలిచారు. 2024లో గెలిచి హ్యాట్రిక్ సాధించారు. ఆయన వరసగా రెండుసార్లు గెలిచినా మూడోసారి ఓటమి పాలు కావడం వల్ల ఆయన పొలిటికల్ హిస్టరీలో హ్యాట్రిక్ సక్సెస్ లేదు. ఈసారి చాలా పట్టుదల మీద ఆయన పోటీకి దిగారు. రాజమండ్రి రూరల్ టికెట్ సాధించుకున్నారు. ఆయన తన పొలిటికల్ కెరీర్‌లో పదోసారి పోటీ చేశారు. ఈసారి గెలుపుతో హ్యాట్రిక్ విక్టరీని సాధించడమే కాదు, తన పొలిటికల్ కెరీర్‌ని పూర్తి సంతప్తిగా కొనసాగించానని సంతృప్తి వ్యక్తం చేశారు.



ధ్రువపత్రం స్వీకరిస్తున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి

తాళ్లపూడిలో టిడిపి హవా

ప్రజాశక్తి-తాళ్లపూడి

టిడిపి కొవ్వూరు ఎంఎల్‌గా విజయం సాధించిన ముప్పిడి వెంకటేశ్వరరావు విజయం తాళ్లపూడి మండలం నుండి ప్రారంభమైందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ముప్పిడి సాధించిన మెజార్టీ ఓట్లలో సుమారు ఆరు వేలకు పైగా తాళ్లపూడి మండలం నుంచి ఎక్కువ సాధించారని తెలిపారు. ముప్పిడికి అత్యధికంగా మండల కేంద్రమైన తాళ్లపూడిలో 1317 ఓట్లు మెజార్టీ రాగా అతి తక్కువగా గజ్జరం గ్రామంలో 94 ఓట్లు మెజార్టీ వచ్చిందని టిడిపి పార్టీ వర్గాలు తెలిపాయి. అన్నదేవరపేట మినహాయించి మిగిలిన అన్ని గ్రామాల్లోనూ ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రత్యర్థి నుంచి మెజార్టీ సాధించారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడిలో బుధవారం మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షులు గోకవరపు బాబులు తెలిపారు. మండల ఆర్యవైశ్య సంఘం, తాళ్లపూడి హెల్పింగ్ హండ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో రాజమండ్రి గౌతమి నేత్రాలయ వైద్య సిబ్బంది డాక్టర్లు రోగులకు పరీక్షలు నిర్వహిస్తారని బాబులు తెలిపారు. మండల ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దన్ రావు, ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.


నిర్మానుష్యంగా ఉన్న తాళ్లపూడి మెయిన్ బజార్

నిర్మానుష్యంగా రోడ్లు

ప్రజాశక్తి-తాళ్లపూడి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా తాళ్లపూడి మెయిన్ బజార్ నిర్మానుష్యంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలుదారులు, లేదా యువత రోడ్డుమీదికి వచ్చిన దాఖలాలు లేవు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లోని టివిలకు అతుక్కుపోయారు. ఫలితాలు తెలిసినప్పటికీ ఎన్నికల కమిషన్ ఆంక్షల కారణంగా పార్టీల అభిమానులు కానీ కార్యకర్తలు కానీ సంబరాలు చేసుకోవడానికి కూడా రోడ్లమీదకు రాలేదు.

స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాల విడుదల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో ఈ నెల 03న జరిగిన జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో, లేదా ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో గానీ ఫలితాలు తెలుసుకొనవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డ్‌లు త్వరలో సంబంధిత డిఇఒ కార్యాలయమునకు పంపిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంక్‌లో విద్యార్థి పేరున సేవింగ్స్ ఖాతా తీసుకుని, తండ్రి లేదా తల్లిని జాయింట్ చేసుకొని ఆధార్ నెంబరును అకౌంటుకు సీడ్ చేయించాలని చెప్పారు. జాతీయ విద్యామంత్రిత్వ శాఖ www.scholarships.gov.in పోర్టల్ తెరుస్తారని తెలిపారు. ప్రతి విద్యార్థి నమోదు చేసుకునేందుకు విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ మెరిట్ లిస్ట్, మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్ కార్డ్ లోనూ, బ్యాంకు పాస్ బుక్‌లోనూ తేడా లేకుండా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

రాజానగరంలో జనసేన అభ్యర్థి బత్తుల విజయం

ప్రజాశక్తి-రాజానగరం

వైసిపి రాజానగరం నియోజకవర్గం అభ్యర్థి జక్కంపూడి రాజాపై జనసేన పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ 34,047 ఓట్లు మెజారిటీతో ఘన విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి ఆఖరి రౌండ్ వరకు జనసేన అభ్యర్థి ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. 16 రౌండ్లకు జనసేన అభ్యర్థి బత్తుల బలరామకష్ణకు మొత్తం 1,05993 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి జక్కంపూడి రాజాకు 71,946 ఓట్లు వచ్చాయి. దీంతో అత్యధిక ఓట్లు సాధించిన బలరామకష్ణ విజయం సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.చైత్య వర్షిణి ప్రకటించారు. ధ్రువపత్రాన్ని బత్తుల బలరామకష్ణ తన సతీమణి వెంకటలక్ష్మితో కలిసి స్వీకరించారు.


ధ్రువపత్రం స్వీకరిస్తున్న బత్తుల బలరామకృష్ణ

టిడిపి కృషి, జక్కంపూడి వ్యతిరేక

నియోజకవర్గంలో జనసేన పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకష్ణ విజయానికి తెలుగుదేశం పార్టీ నాయకుల కృషి తోడయ్యింది. కూటమి తరపున జనసేన అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి టిడిపి శ్రేణులు తన భుజాలపై వేసుకుని బత్తుల విజయానికి కష్ట పడ్డారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌ల వారీగా టిడిపి జనసేన శ్రేణులతో సమన్వయ కమిటీలు వేసి కింది స్థాయి, నియోజకవర్గ టిడిపి శ్రేణులు ఒక పథకం ప్రకారం చేశారు. నియోజకవర్గంలో బలమైన కమ్మ, కాపు, బిసి సామాజికవర్గాలు మద్దతు తెలపడం జనసేన విజయానికి దోహదపడింది. గతంలో జక్కంపూడి రాజాకు గెలుపునకు సహకారం అందించిన పార్టీ సీనియర్ నాయకులు జన సేన పార్టీలో చేరారు. ఇది జనసేన విజయానికి కలిసి వచ్చింది. పార్టీ సీనియర్ నాయకులను రాజా పట్టించుకోకపోవడం, జక్కంపూడిపై వ్యతిరేకత, టిడిపి నాయకులు కలిసి పని చేయడం వల్ల బత్తుల విజయం సొంతం చేస్తున్నారు.

నిడదవోలు కూటమి అభ్యర్థి దుర్గేష్ విజయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

నిడదవోలు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ ప్రారంభం నుండి ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. తొలి రౌండ్‌లో 1728 ఉన్న ఆధిక్యం చివరి 15వ రౌండ్ ఫలితాల వరకూ 32499 ఓట్ల అధిక్యంతో తన సమీప ప్రత్యర్థి, అధికార పక్షం అభ్యర్థి శ్రీనివాస నాయుడుపై ఆధిక్యం సాధించి, విజయదుందుభి మోగించారు. మరో 494 పోస్టల్ ఓట్లతో కలిపి ఆయన 32993 వేల మెజారిటీతో విజయం అందుకున్నారు. 2019లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావుపై జి.శ్రీనివాస్ నాయుడు సాధించిన మెజారిటీ 23000ను దుర్గేష్ ఎక్కడా వెనుతిరగకుండా సునాయాసంగా సాధించారు. నిడదవోలుకు స్థానికేతరుడైనా దుర్గేష్ విజయానికి ఇరు పార్టీల కూటమి ఒక కారణం కాగా, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు శక్తివంచన లేకుండా దుర్గేష్ ఓటమి తన ఓటమిగా భావించి, అతని విజయానికి శ్రమించారు. దీంతోపాటు దుర్గేష్ వ్యక్తిగతంగా సౌమ్యుడు కావడం, జనసేన కార్యకర్తలు కష్టపడి పనిచేయడంతో దుర్గేష్ విజయం సులభతరం అయింది.

ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వనన్న మాట ప్రజలలో నాటుకు పోయిందన్నారు. ఆ మాట ప్రకారం ప్రజలంతా కులమతాలకు, వర్గాలకు, పార్టీలకు, అతీతంగా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. తనకు మంత్రి పదవి, అధినేత పవన్ కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుల నిర్ణయంపై ఉంటుందన్నారు.



ధ్రువపత్రం స్వీకరిస్తున్న కందుల దుర్గేష్


దుర్గేష్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

దుర్గేష్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి-పెరవలి

నిడదవోలు నియోజకవర్గం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గెలుపొందిన కందుల దుర్గేష్‌ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ భూపతిరాజు రవివర్మ, టిడిపి మండల అధ్యక్షుడు అతికాల వెంకట రామకృష్ణమ్మ (శ్రీను) మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు మండల స్థాయి నాయకులు టిడిపి రాజమండ్రి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొడ్డు రామాంజనేయులు, జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవికుమార్, సలాది కృష్ణమూర్తి పి.నాగేశ్వరరావు, సలాది శ్రీహరి, సర్పంచులు కోట శ్రీను, బండారు సాయి, అబ్బిశెట్టి సత్తిరాజు, శేషు, కంటిపూడి సూర్యనారాయణ, వాకలపూడి వీర్రాజు, చక్రవర్తి పలువురు నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.


ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

కడియపులంకలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక గ్రామంలో సచివాలయం-3 పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం క్యాంప్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ శిబిరంలో 251 మంది పేషెంట్లకు అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 30 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీకి ఒకరిని రిఫర్ చేశారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ సర్జన్ డాక్టర్ పూర్ణిమ (అరవిందం ఆర్థోపెడిక్ హాస్పిటల్, రాజమహేంద్రవరం) గైనకాలజిస్ట్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మి (సిఎంఆ హాస్పిటల్ ధవళేశ్వరం) రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి ఆప్తాల్మిక్ టెక్నీషియన్ డి.సాంబయ్య కంటి పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

అనంతేశ్వరునికి అన్నాభిషేకం

ప్రజాశక్తి-కడియం

కడియపులంకలో శ్రీఅపర్ణా సమేత అనంతేశ్వర స్వామి పంచాయతన క్షేత్ర ఆలయ 15వ వార్షికోత్సవం సోమవారం ఆలయ కమిటీ అధ్యక్షులు మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి ఆలయ ప్రధాన అర్చకులు దేవరభట్ల శ్రీనివాస శర్మ నేతృత్వంలో మంత్రోచ్ఛరణలతో స్వామివారికి అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనంతేశ్వరునికి మహా అన్నభిషేకం నిర్వహించారు. అనంతరం యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు, భక్తులు పలువురు నర్సరీ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కూటమి విజయ దుందుభి

- ఐదింట టిడిపి, రెండింట జనసేన గెలుపు
- ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరి విజయం
- అత్యధిక మెజారిటీతో శ్రీనివాస్ గెలుపు
- కౌంటింగ్‌లోనే వెనుతిరిగిన వైసిపి అభ్యర్థులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లావ్యాప్తంగా కూటమికి ఓటర్లు పట్టం కట్టారు. గత నెల 13న పోలింగ్ జరిగిన విషయం విషయం విదితమే. గడిచిన 21 రోజులుగా ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. జూన్ ఒకటో తేదీన విడుదలైన ఎగ్జిట్ పోల్స్ మరింత వేడిని పెంచాయి. తాజాగా మంగళవారం ఫలితాలు విడుదలయ్యాయి. దీంతో ఉత్కంఠకు తెరపడింది. రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అత్యధిక మెజారిటీ సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా ప్రతి రౌండ్‌లోనూ టిడిపి కూటమి అభ్యర్థులు ఆధిక్యత కొనసాగించారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తికాకముందే వైసిపి అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల నుంచి వెళ్లిపోవడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా కౌంటింగ్ ప్రక్రియను విజయవంతం చేయడంలో అధికారులు సఫలీకృతం అయ్యారు. కౌంటింగ్ ముగిసిన అనంతరం రిటర్నింగ్ అధికారులు గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.


జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ బరిలోనూ టిడిపి కూటమి అభ్యర్థులు గెలుపొందారు. పొత్తు నేపథ్యంలో నాలుగు అసెంబ్లీ స్థానాల్లో టిడిపి రెండు స్థానాల్లో జనసేన, ఒక స్థానంలో బిజెపి బరిలో నిలిచిన విషయం విదితమే. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ కూటమి అభ్యర్థుల హవా కొనసాగింది. పార్లమెంట్ బరిలో బిజెపి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి గెలుపొందారు. అనపర్తి నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 1,05720 పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి సత్తి సూర్యనారాయణ రెడ్డికి 84,870 ఓట్లు పోలయ్యాయి. బిజెపి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి 2,0850 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లు 1,96,754 కాగా ఇవిఎం ఓట్లు 194962. పోస్టల్ బ్యాలెట్లు 1792 ఉన్నాయి. రాజానగరం నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు 105995 ఓట్లు పోలయ్యాయి. వైసిపి జిల్లా అధ్యక్షులు, అభ్యర్థి జక్కంపూడి రాజాకు 71946 ఓట్లు పోలయ్యాయి. బత్తుల బలరామకృష్ణ 34049 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం పోలైన ఓట్లు 190938 కాగా ఈవిఎం ఓట్లు 189503 పోస్టల్ బ్యాలెట్లు 1435 ఉన్నాయి. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరికి 129060 ఓట్లు పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణకు 64970 ఓట్లు పోలయ్యాయి. గోరంట్ల బుచ్చయ్య చౌదరి 64090 ఓట్ల మెజారిటీ సాధించారు.(మొత్తం పోలైన ఓట్లు 202058 కాగా ఈవిఎమ్ ఓట్లు 199219 పోస్టల్ బ్యాలెట్లు 2839. రాష్ట్రంలో తొలి ఫలితంగానూ, టిడిపి తొలి విజయం ఈ నియోజకవర్గమే కావడం విశేషం. రాజమండ్రి సిటీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు 123291 ఓట్లు పోలవ్వగా వైసిపి అభ్యర్థి మార్గాని భరత్ రామ్‌కు 51887 ఓట్లు పోలయ్యాయి. ఆదిరెడ్డి శ్రీనివాస్ 71404 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లు 182151 కాగా ఇవిఎం ఓట్లు 179455 పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయి. జిల్లాలో అత్యధిక మెజారిటీతో గెలిచిన అభ్యర్థిగా ఆదిరెడ్డి శ్రీనివాస్ సరికొత్త రికార్డు సృష్టించారు. కొవ్వూరు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు 92743 ఓట్లు పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి తలారి వెంకట్రావుకు 58797 ఓట్లు పోలయ్యాయి. ముప్పిడి వెంకటేశ్వరరావు 33,946 ఓట్ల మెజారిటీ సాధించారు. మొత్తం పోలైన ఓట్లు 159111 కాగా ఇవిఎం ఓట్లు 157471 పోస్టల్ బ్యాలెట్లు 1640 ఉన్నాయి. గోపాలపురం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి మద్దిపాటి వెంకట రాజుకు 114420 ఓట్లు పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి తానేటి వనితకు 87636 ఓట్లు పోల్ అయ్యాయి. మద్దిపాటి వెంకటరాజు 26784 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం పోలైన ఓట్లు 211659 కాగా ఇవిఎమ్ ఓట్లు 210390, పోస్టల్ బ్యాలెట్లు 1269 ఉన్నాయి. నిడదవోలు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్‌కు 104089 ఓట్లు పోల్ అయ్యాయి. వైసిపి అభ్యర్థి జి.శ్రీనివాసనాయుడుకు 69990 ఓట్లు పోల్ అయ్యాయి. కందుల దుర్గేష్ 34,799 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లు 182503 కాగా ఇవిఎం ఓట్లు 180701, పోస్టల్ బ్యాలెట్లు 1802ఉన్నాయి.



కలెక్టర్ నుంచి ధ్రువపత్రం స్వీకరిస్తున్న బిజెపి ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి

పార్లమెంట్ బరిలో పురందేశ్వరి విజయం

పార్లమెంట్ బరిలో దగ్గుపాటి పురందేశ్వరి విజయం సాధించారు. పార్లమెంట్ బరిలో 12 మంది అభ్యర్థులు బరిలో తలపడ్డారు. బిజెపి, వైసిపి, ఇండియా ఫోరం, బహుజన సమాజ్ పార్టీ, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ, జై భారత్ నేషనల్ పార్టీ, రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీలతో పాటు ఐదుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీ చేశారు. ఈ నియోజకవర్గంలో మొదటి మూడు స్థానాల్లో బిజెపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీ నిలువగా నాలుగో స్థానంలో నోటాకు ఘణనీయంగా ఓట్లు లభించాయి. కూటమి తరుపున బిజెపి అభ్యర్థిగా బరిలో నిలిచిన పురందేశ్వరికి 7,26,515 ఓట్లు పోల్ అయ్యాయి. వైసిపి అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్‌కు 4,87,376 ఓట్లు పోల్ అయ్యాయి. దగ్గుపాటి పురందేశ్వరి 2,39,139 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పార్లమెంట నియోజకవర్గంలో 13,25,297 ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో ఇవిఎం ఓట్లు 13,11,751 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్‌లో 13,546 ఓట్లు పోల్ అయ్యాయి. ఈ నియోజకవర్గంలో ఇండియా ఫోరం అభ్యర్థిగా బరిలో దిగిన గిడుగు రుద్రరాజుకు 32,508 ఓట్లు పోలయ్యాయి. నోటాకు 24,435 ఓట్లు పోలయ్యాయి



ఆర్ఓ నుంచి ధ్రువపత్రం స్వీకరిస్తున్న నల్లమిల్లి

నల్లమిల్లికి కలిసి వచ్చిన సానుభూతి

ప్రజాశక్తి- బిక్కవోలు

అనపర్తి నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గెలుపునకు ప్రజల్లో సానుభూతి కలిసి వచ్చింది. అధికార వైసిపి అభ్యర్థి డాక్టర్ సత్తిసూర్యనారాయణ రెడ్డిపై 20567 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో టిడిపి కూటమి అభ్యర్థిగా తొలుత బిజెపి అభ్యర్థిగా శివరామకృష్ణంరాజును ప్రకటించిన విషయం విదితమే. ప్రతిపక్ష నేతగా ఈ నియోజకవర్గంలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారు. టిడిపి సీటు ఇవ్వకపోవడంతో 'న్యాయం కోసం నల్లమిల్లి' పేరుతో కుటుంబం అంతా కలిసి చేసిన ప్రచార కార్యక్రమంతో నియోజకవర్గంలో విశేష సానుభూతి లభించింది. దీంతో టిడిపి పెద్దలు దిగొచ్చారు. బిజెపితో మంతనాలు జరిపారు. బిజెపి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణా రెడ్డిని పోటీలోకి దింపారు.



ఆర్ఓ నుంచి ధ్రువపత్రం స్వీకరిస్తున్న వాసు

రాజమహేంద్రవరంలో టిడిపి రెపరెప

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో టిడిపి మరోసారి విజయ దుందుభి మోగించింది. ఈ నియోజకవర్గం టిడిపికి బలమైన స్థానం. ఈ నియోజకవర్గంలో 2019 వైసిపి హవాలోనూ టిడిపి అభ్యర్థిగా ఆదిరెడ్డి భవాని విజయం సాధించారు. ఈసారి భవాని భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్ బరిలో నిలిచారు. వైసిపి అభ్యర్థి మార్గాని భరత్ రామ్‌పై 71,404 ఓట్ల మెజార్టీతో వాసు గెలుపొందారు. ఏడాది క్రితం చిట్‌ఫండ్ కేసులో ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావును సిఐడి విచారించిన విషయం విదితమే. ఆదిరెడ్డి కుటుంబానికి నియోజకవర్గంలో ప్రజలతో ఉన్న ప్రత్యక్ష సంబంధాలు గెలుపునకు అవకాశాలను సుగమం చేశాయి. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కౌన్సిల్ లేకపోవడం, ప్రత్యేకాధికారి పాలనలో ఇష్టారాజ్యంగా పన్నులు విధించడంతో వైసిపిపై ప్రజల్లో వ్యతిరేకత నెలకొంది. ఏప్రిల్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షంతో రాజమహేంద్రవరం నగర వీధులు చెరువులను తలపించడం అభివృద్ధి డొల్లతనాన్ని అద్దంపట్టింది. ఈ వరుస పరిణామాలు శ్రీనివాస్‌ను గెలుపు శిఖరాలను చేర్చాయి.

నిడదవోలులో ఎగిరిన జనసేన జెండా

ప్రజాశక్తి- నిడదవోలు

నిడదవోలు నియోజకవర్గంలో జనసేన జెండా ఎగిరింది. జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్, వైసిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎ జి.శ్రీనివాసనాయుడుపై 34,799 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తొలుత రాజమండ్రి రూరల్ స్థానాన్ని ఆశించారు. టిడిపి ఆ స్థానాన్ని సిట్టింగ్ ఎంఎల్‌ఎ బుచ్చయ్య చౌదరికి కేటాయించింది. దీంతో ఆ నియోజకవర్గంలో జనసేన శ్రేణులు భగ్గుమన్నాయి. జనసేనాని సూచనలతో నిడదవోలులో దుర్గేష్ తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. గడిచిన రెండు నెలల్లో ఆయన భార్య, తల్లి అనారోగ్యంతో మరణించారు. అయినప్పటికీ మానసికంగా ధైర్యంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. ప్రజలతో మమేకమయ్యారు. మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు సహకారం, జనసేన శ్రేణులను ఒప్పించి ప్రజల్లోకి వెళ్లడం విజయ అవకాశాలను దగ్గర చేసింది. స్థానిక ఎంఎల్‌ఎ జి.శ్రీనివాస నాయుడు ప్రజలకు అందుబాటులో లేకపోవడం దుర్గేష్‌కు సానుకూలంగా మారింది. దీంతో దుర్గేష్ స్థానికేతరుడైనా విజయ దుందుభి మోగించారు.

మంత్రి వనితపై మద్దిపాటి విజయం

ప్రజాశక్తి-దేవరపల్లి

గోపాలపురం నియోజకవర్గం నుంచి మంత్రి తానేటి వనిత టిడిపి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు చేతిలో పరాజయం చెందారు. మంత్రి వనిత కొవ్వూరు నియోజవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా ఆమెను అక్కడి నుంచి గోపాలపురం మార్చి టికెట్ ఇచ్చారు. ఇక్కడ ఎంఎల్‌ఎగా ఉన్న తలారి వెంకట్రావును కొవ్వూరు నుంచి పోటీ చేయించారు. తలారి వెంకట్రావుపై గతంలో నియోజకవర్గంలో చోటు చేసుకున్న ఒక హత్య కేసులో కొంత వ్యతిరేకత వచ్చింది. కొవ్వూరులో మంత్రి వనితపై పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉండడంతో ఆమెను గోపాలపురం మార్చారు. ఆమె తండ్రి బాబాజీరావు గతంలో గోపాలపురం నుంచి ఎంఎల్‌ఎగా ప్రాతినిధ్యం వహించారు. ఈ నేపథ్యం కూడా ఆమెకు కలిసి రాలేదు. టిడిపి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు 1,14,420 ఓట్లు సాధించి 26784 భారీ మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 18 రౌండ్లలో ఆధిక్యం కనపరుస్తూ మద్దిపాటి వెంకట్రాజు విజయం సాధించారు. ప్రత్యర్థి తానేటి వనితపై 26,784 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. మద్దిపాటి వెంకటరాజుకు ఆర్ఓ శివజ్యోతి ధ్రువపత్రం అందించారు.

నియోజకర్గంలో ప్రధానంగా రోడ్ల సమస్యతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, కనీస మౌలిక వసతులు లేమి వేధించాయి. పలు గ్రామాల్లో జగనన్న లేఔట్లు నివాసయోగ్యం లేకపోవడంతో ప్రజలు వాటిని వ్యతిరేకించారు. గత ప్రభుత్వంలో ఆగిన ఇళ్ల నిర్మాణ పనులు బిల్లులు చెల్లించకపోవడం, కొత్తగా సొంత స్థలం వారికి ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు మంజూరు చేయకపోవడంతో వ్యతిరేకత వచ్చింది. ప్రధానంగా గ్రామాలలో మండలాలలో అభివృద్ధి మరిచారు.. గత ప్రభుత్వంలో హౌసింగ్ రుణాలు చెల్లించాలంటూ ప్రజలపై ఒత్తిడి తెచ్చారు. వైసిపి నాయకుల మధ్య వర్గ పోరు దెబ్బ తీసింది. టిడిపి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు తక్కువ సమయంలోనే భారీ ర్యాలీలు నిర్వహించి ప్రజలలోకి వెళ్లారు. తొలుత ముళ్లపూడి బాపిరాజు వర్గం మద్దిపాటికి సీటు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఒక దశలో చంద్రబాబు సమక్షంలోనే ఆందోళనకు దిగారు. దీంతో అధినేత ఆగ్రహానికి గురికాక తప్పలేదు. అనంతరం పెద్దల సమక్షంలో జరిగిన చర్చలు సత్ఫలితాలనిచ్చాయి.



ఆర్ఓ నుంచి ధ్రువపత్రం స్వీకరిస్తున్న మద్దిపాటి వెంకటరాజు

టిడిపికి పెట్టని కోట కొవ్వూరు

ప్రజాశక్తి- కొవ్వూరు, చాగల్లు

తెలుగుదేశం పార్టీకి పెట్టని కోట అయిన కొవ్వూరు నియోజకవర్గంలో మరోసారి తెలుగుదేశం జెండా ఎగిరింది. టిడిపి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, అధికార పార్టీ అభ్యర్థి తలారి వెంకట్రావుపై 33,946 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గ ఎంఎల్‌ఎ, హోమ్ మంత్రి తానేటి వనిత ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకున్నారు. ఈ నేపథ్యంలో వైసిపి గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావును ఎంఎల్‌ఎగా బరిలో దింపింది. అయినప్పటికీ ఓటమి తప్పలేదు. ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానికేతరుడు అయినప్పటికీ ఇక్కడి ప్రజలతో సత్సంబంధాలున్నాయి. మరోవైపు ఈ ప్రాంతంలో టిడిపికి బలమైన పునాది ఉంది. ఈ రెండు అంశాలతో పాటు గోదావరి నది ఒడ్డునే ఉన్నప్పటికీ ఇసుక కొరత, స్థానికులకు ఉపాధి లేకపోవటం వంటి ప్రభుత్వ వ్యతిరేక అంశాలు టిడిపికి కలిసి వచ్చాయి. తెలుగుదేశం పార్టీని గెలిపించుకునేందుకు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లిన వారు సైతం పోలింగ్ రోజున విశేషంగా పాల్గొనటం సానుకూల అంశంగా మారింది. వైసిపిలో గ్రూపు తగాదాలు, ఇసుక దందాలు, కౌలు రైతుల వ్యతిరేకత ఆ పార్టీ ఓటమికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

పదిసార్లు పోటీ ... ఏడుసార్లు విజయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీకి పదిసార్లు పోటీ చేసి ఏడుసార్లు విజయం సాధించి రికార్డు సృష్టించారు గోరంట్ల బుచ్చియ్య చౌదరి. టిడిపి ఆవిర్భావం నుంచి ఆయన పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. అప్పటి నుంచి ఆయన టిడిపి అభ్యర్థిగా పదిసార్లు పోటీ చేశారు. రాజమహేంద్రవరం సిటీ నుంచి నాలుగు సార్లు, రాజమహేంద్రవం రూరల్ నియోజకవర్గం నుంచి మూడు సార్లు పోటీ చేసి గెలుపొందారు. రెండు వరుస విజయాల అనంతరం ఓటమి చెందడం సెంటిమెంట్‌గా ఉన్న ఆయన ఈ సారి దానికి చెక్‌పెట్టి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేశారు. తన ఖాతాలో ఏడో విజయాన్ని నమోదు చేసుకున్నారు.



వేగుళ్ల నాలుగోసారి...

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండపేట ఎంఎల్ వేగుళ్ల జోగేశ్వరరావు నాలుగు సార్లు అసెంబ్లీ మెట్లు ఎక్కారు. 2004లో తొలిసారి పోటీ చేసి ఓటమి చెందిన ఆయన 2009లో పిఆర్‌పి అభ్యర్థిపై విజయం సాధించి తొలిసారి అసెంబ్లీ మెట్లు ఎక్కారు. అనంతరం 2014, 2019 ఎన్నికల్లో టిడిపి తరుపున పోటీ చేసి మండపేట నుంచి ఎంఎల్ఏగా గెలుపొందారు. తాజా ఎన్నికల్లో ఆయన ఇదే స్థానం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులపై విజయం సాధించారు.



తూర్పు గోదావరి

నియోజకవర్గం	విజేత	ఓట్లు	పార్టీ	ఆధిక్యం	ప్రత్యర్థి	ఓట్లు
రాజమండ్రి	ఆదిరెడ్డి వాసు	1,23,291	టిడిపి	71,704	మార్గాని భరత్	51,887
రాజమండ్రి రూరల్	బుచ్చయ్యచౌదరి	1,29,060	టిడిపి	64,090	వేణుగోపాలకృష్ణ	64,970
అనపర్తి	ఎన్.రామకృష్ణారెడ్డి	1,05,720	బిజెపి	20,850	సూర్యనారాయణరెడ్డి	84,870
రాజానగరం	బత్తుల బలరామకృష్ణ	1,05,995	జనసేన	34,049	జక్కంపూడి రాజా	71,946
నిడదవోలు	కందుల దుర్గేష్	1,02,699	జనసేన	33,304	జి.ఎస్.నాయుడు	69,395
కొవ్వూరు	ముప్పిడి శ్రీనివాస్	92,743	టిడిపి	33,946	తలారి వెంకట్రావు	58,797
గోపాలపురం	మద్దిపాటి వెంకట్రాజు	1,14,420	టిడిపి	26,784	తానేటి వనిత	87,636

కాకినాడ

నియోజకవర్గం	విజేత	ఓట్లు	పార్టీ	ఆధిక్యం	ప్రత్యర్థి	ఓట్లు
కాకినాడ	వి.వెంకటేశ్వరరావు	1,13,014	టిడిపి	56,572	డి.చంద్రశేఖర్‌రెడ్డి	56,442
కాకినాడ రూరల్	పంతం నానాజీ	1,34,414	జనసేన	72,040	కురసాల కన్నబాబు	62374
పెద్దాపురం	ఎన్.చినరాజప్ప	1,04,407	టిడిపి	40,451	దవులూరి దొరబాబు	64,699
పిఠాపురం	కె.పవన్‌కళ్యాన్	1,34,304	జనసేన	70,279	వంగా గీత	64,115
తుని	యనమల దివ్య	97,206	టిడిపి	15,177	దాడిశెట్టి రాజా	82,029
జగ్గంపేట	జ్యోతుల నెహ్రూ	1,13,593	టిడిపి	52,676	తోట నరసింహం	60,917
ప్రత్తిపాడు	వరుపుల సత్యప్రభ	1,03,002	టిడిపి	38,768	వరుపుల సుబ్బారావు	64,234

కోనసీమ

నియోజకవర్గం	విజేత	ఓట్లు	పార్టీ	ఆధిక్యం	ప్రత్యర్థి	ఓట్లు
అమలాపురం	ఎ.ఆనందరావు	1,04,022	టిడిపి	38,628	పినిపే విశ్వరూప్	65,394
పి.గన్నవరం	గిడ్డి సత్యనారాయణ	96,108	జనసేన	33,367	వేణుగోపాలరావు	62,741
ముమ్మిడివరం	దాట్ల సుబ్బరాజు	1,18,687	టిడిపి	38,736	పి.సతీష్‌కుమార్	79,951
రాజోలు	దేవ వరప్రసాద్	95,514	జనసేన	39,011	గొల్లపల్లి సూర్యారావు	56,503
కొత్తపేట	బి.సత్యానందరావు	1,34,286	టిడిపి	56,479	చిర్ల జగ్గిరెడ్డి	77,807
మండపేట	వేగుళ్ల జోగేశ్వరరావు	1,16,309	టిడిపి	44,435	తోట త్రిమూర్తులు	71,874
రామచంద్రపురం	వాసంశెట్టి సుభాష్	1,05,685	టిడిపి	26,291	పిల్లి సూర్యప్రకాష్	97,652

తూర్పు గోదావరి మొత్తం ఓట్లు : 16,23,149

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	కూటమి	వైసిపి	కాంగ్రెస్	ఆధిక్యం
రాజమండ్రి సిటీ	2,67,484	1,76,419	1,23,291	51,887	1,918	71,404
రాజమండ్రి రూరల్	2,72,826	1,97,840	1,29,060	64,970	2,728	64,090
అనపర్తి	2,26,053	1,82,873	1,05,720	84,870	1,300	20,850
రాజానగరం	2,16,491	1,75,285	1,05,995	71,946	1,901	34,049
కొవ్వూరు	1,84,136	1,49,782	92,743	58,797	1,897	33,946
నిడదవోలు	2,13,396	1,67,439	1,02,699	69,395	1,691	33,304
గోపాలపురం	2,42,763	1,96,919	1,14,420	87,636	2,387	26,784

కాకినాడ జిల్లా మొత్తం ఓట్లు : 16,34,122

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	కూటమి	వైసిపి	కాంగ్రెస్	ఆధిక్యం
కాకినాడ సిటీ	2,41,620	1,74,446	1,13,014	56,442	2,138	56,572
కాకినాడ రూరల్	2,69,330	1,69,180	1,34,414	62,374	2,205	72,040
పిఠాపురం	2,36,409	1,93,831	1,34,304	64,115	1,231	70,279
జగ్గంపేట	2,29,863	1,57,478	1,13,593	60,917	1457	52,676
ప్రత్తిపాడు	2,17,267	1,84,820	1,03,002	64,234	1,354	38,768
తుని	2,24,538	1,58,877	97,206	82,029	1,923	15,177
పెద్దాపురం	2,15,095	1,59,732	1,05,685	65,234	2168	40,451

డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ మొత్తం ఓట్లు : 15,31,410

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	కూటమి	వైసిపి	కాంగ్రెస్	ఆధిక్యం
అమలాపురం	2,13,508	1,66,899	1,04,022	65,394	1,357	38,628
రాజోలు	1,97,920	1,48,281	95,514	56,503	1,435	39,011
పి.గన్నవరం	1,98,602	1,50,639	96,108	62,741	1,583	33,367
ముమ్మిడివరం	2,45,296	1,59,466	1,18,687	79,951	1,342	38,736
కొత్తపేట	2,52,383	1,95,092	1,34,286	77,807	1,169	56,479
మండపేట	2,20,494	1,88,853	1,16,309	71,874	1,484	44,435
రామచంద్రపురం	2,03,207	1,68,641	97,652	71,361	1,173	26,291



కొవ్వూరులో ఉద్రిక్తత

అన్నా క్యాంటీన్, వైసిపి కార్యాలయంపై దాడి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మెరకవీధిలోని వైఎస్ఆర్‌సిపి ప్రధాన కార్యాలయం, బస్ స్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు అన్న క్యాంటీన్ భవనంలోని వస్తువులు ధ్వసం చేశారు. వైఎస్ఆర్‌సిపి కార్యాలయం వద్ద గల రెండు కార్ల అద్దాలు పగులకొట్టారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదూ రాలేదని పోలీసులు తెలిపారు. ధ్వంసం చేసిన వాహనాల్లో ఒకటి వైసిపి అభ్యర్థి ప్రచారానికి వినియోగించన వాహనం.





పిఠాపురం నుంచి జనసేన అభ్యర్థి కొణిదల పవన్‌కళ్యాణ్ గెలిపొందినట్టుగా ప్రకటిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని ఆయన తరుపున నాగబాబుకు అందిస్తున్న ఆర్‌ఓ రామ్‌సుందర్ రెడ్డి



కలెక్టర్ జె.నివాస్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న కాకినాడ ఎంపీగా గెలుపొందిన జనసేన అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్



కాకినాడ రూరల్‌లో ఫలితాల అనంతరం ఫ్యాన్‌కు తాడు కట్టి లాక్కెళ్తున్న యువకులు